క్లుప్తంగా

ఆసిఫ్ ఎంపికతో సంబరాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా షేక్ ఆసిఫ్ పేరున పార్టీ అధిష్టానం ప్రకటించిన క్రమంలో శనివారం సాయంత్రం నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. విద్యాధరపురం ఆర్టీసీ డిపో పక్కనగల పశ్చిమ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ కార్పొరేటర్లు, శ్రేణులంతా కలిసి కేక్ కట్ చేసి ఆసిఫ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గొల్లపూడి బైపాస్ రోడ్‌పై పార్టీ జెండాను రెపరెపలాడిస్తూ జై జగన్..సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి...జిందాబాద్ ఆసిఫ్ వంటి నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమోగిపోయింది. యువకులు బాణాసంచా కాల్చి కేరింతలు కొడుతూ మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ పార్టీలో సామాన్య కార్యకర్తనైన తనను పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించిన సీఎం జగనన్నకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. పార్టీని నమ్ముకున్నవారికి ఎప్పటికైనా న్యాయం జరుగుతుందని, అందుకు నిదర్శనం తానేనని చెప్పారు.

నాగభూషణం సేవలు ప్రశంసనీయం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి సీహెచ్ నాగభూషణం కళాశాలకు అందించిన సేవలు ప్రశంసనీయమని కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అన్నారు. కేబీఎన్ కళాశాలలో 30 సంవత్సరాలుగా అధ్యాపకునిగా పని చేసిన భౌతిక శాస్త్ర విభాగాధిపతి నాగభూషణం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన అభినందన సభకు శ్రీనివాసు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కేబీఎన్ కళాశాలలో ఎంతో మంది విద్యావేత్తలు అధ్యాపకులుగా పని చేసి కళాశాల ప్రతిష్టను మరింతగా ఇనుమడింపజేశారన్నారు. అదేకోవలో నాగభూషణం అద్భుతమైన సేవలందించారని కొనియాడారు. నాగభూషణం వంటి అధ్యాపకులు అందించిన సేవలతోనే కళాశాల మరింతగా అభివృద్ధిని సాధించిందని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దిన నాగభూషణం భావి జీవితం చక్కగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, డాక్టర్ కె.రామకృష్ణ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాగ్యకుమార్, పీజీ డైరెక్టర్ ఎస్.వెంకటేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. కళాశాల యజమాన్యం, సిబ్బంది నాగభూషణంను సత్కరించింది.

24న సామూహిక ఉపనయన మహోత్సవం

విజయవాడ కల్చరల్: అమరావతి బ్రాహణ సేవా సంఘం ఆధర్యంలో 24 వ తేదీ ఆదివారం ఉదయం సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణ మండపంలో సామూహిక ఉపనయన మహోత్సవం నిర్వహిస్తునట్లు ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి వెంకట దశరథ రమేష్ అధ్యక్షుడు డాక్టర్ బీవీ గురునాథశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని బ్రాహ్మణ వటువులు వినియోగించుకోవాలని కోరారు. పేర్లు నమోదుకు కన్వీనర్ యడ్లపాటి శేషశాయి 96181 93027, కో కన్వీనర్ శిరీష 83748 52222 సంప్రదించాలని కోరారు.

హోటల్స్, లాడ్జిల్లో పోలీసు తనిఖీలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె రాణా ఆదేశాల మేరకు ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు హోటల్స్, లాడ్జిలలో శనివారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. సీఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది గాం.దీనగర్, సత్యనారాయణపురం ప్రాంతాల్లోని లాడ్జిలు, హోటల్స్‌ల్లో క్షుణంగా తనిఖీలు చేపట్టారు. రిజిష్టర్లను తనిఖీ చేసి అనుమానితుల ఆధారాలను పరిశీలించారు. హోటల్స్‌కు వచ్చే వారి గుర్తింపు కార్డులు, పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎవరైన అనుమానిత వ్యక్తులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా నిర్వాహకులకు సూచించారు.

అన్ని రంగాల్లో రాణించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలు అవకాశాలను అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో రాణించాలని అధ్యాపకురాలు శుభ సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మహిళా సాధికారతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలని, మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని, తోచినంతలో సేవ చేయడంతో పాటు బాగా చదువుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని సూచించారు.

పేదలకు స్థలాలు ఇచ్చిన ఘనత జగనన్నదే

- ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)
- టిడ్కో, జగనన్న కాలనీల గృహ స్వాధీన ధ్రువీకరణ పత్రాల పంపిణీ



దివ్యాంగురాలికి టిడ్కో గృహ స్వాధీన పత్రం అందచేస్తున్న కేశినేని నాని, వెలంపల్లి, ఆసిఫ్, భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని) తెలిపారు. విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యాన తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన టిడ్కో 300 ఎస్ఎఫ్‌టీ ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలతోపాటు 'నవరత్నాలు–పేదలందరికి ఇళ్లు' పథకంలో భాగంగా గృహ స్వాధీన ధ్రువీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో 5 లక్షల ఇళ్లు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం నిధులిస్తే చంద్రబాబు ఒక్కరికీ కూడా ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదని గుర్తు చేశారు. ఈ ఒక్క విషయంలోనే రూ.5వేల కోట్ల స్కామ్‌కు పాల్పడ్డ చంద్రబాబు అసమర్థ, అవినీతి పరుడని మండిపడ్డారు. రాష్ట్రంలో కోటీ అరవై ఐదు లక్షల కుటుంబాలుంటే అందులో కోటీ ముప్పై ఐదు లక్షల కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. సీఎం జగన్ ప్రభుత్వంలో రూ.30 వేల కోట్ల మేర అభివృద్ధి జరిగితే దుష్టచతుష్టయానికి అవేమీ కనబడవని ధ్వజమెత్తారు. రాజధాని పేరుతో అమరావతిలో మూడు వేల కోట్లు కూడా ఖర్చు పెట్టని చంద్రబాబు మాటలు వింటే పచ్చ కామెర్ల సామెత గుర్తుకు వస్తుందన్నారు. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే అమరావతిని వాడుకున్నారని పేర్కొన్నారు.

ఉచితంగా టిడ్కో ఇళ్ల పంపిణీ....

రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ గత ప్రభుత్వం టిడ్కో ఇళ్ల పేరు చెప్పి 12 వేల మంది దగ్గర డబ్బు వసూలు చేసి కూడా వాటిని పూర్తి చేయలేదని గుర్తు చేశారు. సీఎం జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత టిడ్కో ఇళ్లు పూర్తి చేశారని, వాటిని లబ్ధిదారులకు ఇప్పుడు ఉచితంగా అప్పగించామని తెలిపారు. చాల మందికి వారు చెల్లించిన డబ్బును జగన్ ప్రభుత్వం వాపసు చేసిందని పేర్కొన్నారు.

జగనన్నతోనే పేదలకు మేలు...

పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబులా మాట ఇస్తే తప్పే నైజం సీఎం జగనన్నది కాదని స్పష్టం చేశారు. ప్రజలకు మేలు జరగాలంటే జగనన్న ప్రభుత్వానికే సాధ్యమన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల నిర్మాణం పేరుతో పేదల నుంచి డబ్బు వసూలు చేయటమే కాకుండా రూ.100 కోట్లు అప్పు చేసిన ఘనుడు చంద్రబాబని ఎద్దేవా చేశారు. దాదాపు 12 వేలమంది వద్ద డబ్బు వసూలు చేసిన చంద్రబాబు ప్రభుత్వం 6వేల మందికి మాత్రమే ఇళ్లు నిర్మించి వాటిని కూడా పూర్తి చేయకుండా వదిలేశారని చెప్పారు. అసంపూర్తి టిడ్కో ఇళ్లను పూర్తి చేయించి లబ్ధిదారులకు ఉచితంగా అందించిన ఘనత జగనన్నదని పేర్కొన్నారు. పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ అభ్యర్థులు దేవినేని అవినాష్, షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా ఎదగాలన్నదే జగనన్న ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రికి రాని ఆలోచనలు జగనన్న చేశారని, తద్వారా రాష్ట్రాభివృద్ధికి బాటలు వేశారని తెలిపారు. అమరావతి ప్రాంతంలో నగర ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే కోర్టుకు వెళ్లి అడ్డుకున్న దుర్మార్గుడు చంద్రబాబు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేదిక కింద వీల్ చైర్‌పై కూర్చున్న పెజ్జోనిపేటకు చెందిన దివ్యాంగురాలు ఎస్.మల్లేశ్వరికి టిడ్కో గృహ స్వాధీన పత్రాలు, తాళం అందచేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజ రెడ్డి, వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు జన్మంతా రుణపడి ఉంటా

వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్



పంజా సెంటర్‌లో అభివాదం చేస్తున్న ఆసిఫ్



పార్టీ జెండా చేతబూని సందడి చేస్తున్న ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తనను పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జన్మంతా రుణపడి ఉంటానని షేక్ ఆసిఫ్ అన్నారు. పశ్చిమ నియోజకవర్గ ఆ పార్టీ అభ్యర్థిగా ఇడుపాలయపాయిలో పార్టీ ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గంలోని పంజా సెంటర్ తదితర ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబరాలు నిర్వహించారు. టీవీలో వస్తున్న లైవ్‌ను చూస్తు ఉన్న నాయకులు ఆసిఫ్ పేరు ప్రకటించగానే నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి హడావుడి చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి, ఆసిఫ్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు నాయకులు ఆసిఫ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందటం ఖాయమని భరోసా కల్పించారు. స్వీట్లు తినిపించి తమ సంతోషాన్ని పంచుకున్నారు. నాయకులు, కార్యకర్తలు ఆసిఫ్‌ను భుజాలపై ఎత్తుకొని జేజేలు పలికారు.

ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ జగనన్నకు జన్మంతా రుణపడి ఉంటానని పేర్కొన్నారు. సామాన్యుడుగా ఉన్న తనను కార్పొరేటర్‌గా, ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, నియోజకవర్గ ఇన్‌చార్జిగా, పార్టీ మైనార్టీ సెల్‌లో అనేక బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి నేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించటం ఆనందంగా ఉందన్నారు. తనను జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు నడిపించి ఈ స్థాయికి తీసుకొచ్చారని ఉద్వేగానికి గురయ్యారు. ఆయన రుణం తీర్చుకోలేనిదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని తాను కలిసినప్పుడల్లా నన్ను ఆయన గుండెల్లో పెట్టుకుంటానంటూ అనేవారని నిజంగా అది నిజమని పేర్కొన్నారు. మైనార్టీలను గుర్తించి ఏడుగురుకు సీట్లు అందించటం ఆనందంగా ఉందన్నారు. తాను భారీ మెజార్టీతో గెలిచి ముఖ్యమంత్రికి బహుమానంగా అందిస్తానన్నారు. తనకు అండగా నిలిచిన కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

దర్గా, దుర్గగుడి, చర్చిల్లో ప్రార్థనలు...

సంబరాలు పూర్తవ్వగానే పంజా సెంటర్‌లోని దర్గాలో ఆసిఫ్ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు, నాయకులు ఆయనతో పాటుగా ప్రార్థనల్లో పాల్గొన్నారు. అక్కడి నుంచి నేరుగా దుర్గగుడికి వెళ్లిన ఆసిఫ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో వేద పండితుల ఆశీస్సులందుకున్నారు. అక్కడి నుంచి సీఎస్ఐ చర్చికి వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ఫాదర్ నుంచి ఆశీస్సులందుకున్నారు.

వేధింపుల భర్తపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఆంజనేయ వాగు దుక్కా తిరుపతమ్మ వీధికి చెందిన ఎం.జ్యోతి, నాగేంద్రకుమార్ భార్యాభర్తలు. వీరికి వివాహమై 12 సంవత్సరాలు అవుతుంది. వీరికి ఇద్దరు సంతానం. నాగేంద్రకుమార్ గతంలో సిమెంట్ రేకుల కంపెనీ నిర్వహించే వాడు. కంపెనీలో పని చేసే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని కుటుంబాన్ని సరిగా పట్టించుకోవడం లేదు. దీనిపై ప్రశ్నించిన భార్యను వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కంటి రుగ్మతలపై అప్రమత్తత అవసరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): నీటి కాసులు (గ్లకోమా) వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి. ఫణిధర్ తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, వాసన్ ఐ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం గ్లకోమాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పుష్పా హోటల్ వద్ద ర్యాలీని ప్రారంభించి డాక్టర్ ఫణిధర్ మాట్లాడారు. కంటి జబ్బులలో అతి ప్రమాదకరమైనది గ్లకోమా అని, దీని వలన కంటిలో ఒత్తిడి పెరిగి కంటి నరములు క్షీణతకు గురవుతాయన్నారు. దీంతో చూపు క్రమంగా మందగించి అంధత్వం కలుగుతుందన్నారు. నొప్పి వుండని కారణంగా చూపు పూర్తిగా పోయే వరకు రోగి గమనించలేడన్నారు. కంటికి సంబంధించి ఈ లక్షణాలు కనపడగానే తక్షణం కంటి వైద్య నిపుణులను సంప్రదించాలని కోరారు. ర్యాలీలో డాక్టర్ చిత్ర, డాక్టర్ మాధవిలత డాక్టర్ అనిల్ శేషుకుమార్, ఆసుపత్రి నిర్వాహకులు వెంకట నాయుడు, పలువురు వైద్య ప్రముఖులు, వైద్య సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు అపూర్వం



పొట్టి శ్రీరాములకు నివాళులర్పిస్తున్న లక్ష్మణస్వామి



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగు ప్రజలకు పొట్టి శ్రీరాములు అందించిన సేవలు అపూర్వమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. పొట్టిశ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ కార్యాలయం సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన షేక్ ఆసిఫ్ ఇతర నాయకులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రుల కోసం తన ప్రాణాలను పణంగా పెట్టి నిరాహారదీక్ష చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం పొట్టి శ్రీరాములను పూర్తిగా నిర్లక్ష్యం చేసి అగౌరవపరిచిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పొట్టి శ్రీరాములు గౌరవాన్ని కాపాడే విధంగా పలు కార్యక్రమాలను అమలు చేస్తుందని వివరించారు.

కార్యక్రమంలో ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, స్థానిక కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ, అర్బన్ సంఘం అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ, యువజన సంఘం అధ్యక్షుడు గుడిపాటి కిషోర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, నాయకులు శేగు వెంకటేశ్వర్లు, సాధు సత్యనారాయణ, అన్నం రామకృష్ణారావు, కోటి పుల్లారావు, వివిధ కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు దేరంగుల వెంకట రమణ మజ్జి శ్రీనివాసరావు, నాయకులు మండల శ్రీనివాసరావు, బాజీబాబా తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు ఎనలేనివి

పొట్టి శ్రీరాములు తెలుగువారికి అందించిన సేవలు అద్వితీయమని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి పి.లక్ష్మణస్వామి అన్నారు. కళాశాల ఆవరణలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆయన జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణస్వామి మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు తెలుగుజాతి గర్వించదగ్గ మహనీయుడన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు శ్రీరాం రాధాకృష్ణమూర్తి ప్రిన్సిపాల్ జే లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని స్థానిక సామారంగంచౌక్ సెంటర్‌లోని పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ వీవీకే నరసింహారావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నూకల నాగేశ్వరరావు, నాయకులు కొనిజేటి రమేష్, ఎం గుర్నాధం, నంబూరి రాము, సిహెచ్ రూప్‌కుమార్, ఆలపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమిని తరిమికొట్టాలి



పథకాల కరపత్రం అందిస్తున్న ఆసిఫ్

షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రానున్న ఎన్నికల్లో ప్రజలను మోసం చేయటానికి వస్తున్న టీడీపీ కూటమిని ప్రజలు తరిమికొట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ పిలుపునిచ్చారు. గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమంలో భాగంగా 37వ డివిజన్ కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ ఆధ్వర్యంలో పాతబస్తీలోని పల్లెవీధి, రాజరంగయ్యప్పారావు వీధి, సుబ్బరామయ్యవీధి తదితర వాణిజ్య ప్రాంతాల్లో ఆసిఫ్ ఇతర నాయకులు శనివారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసిఫ్ మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు 2014 ఎన్నికల్లో ఆరు వందల హామీలిచ్చి అధికారాన్ని చేపట్టి ప్రజలను నిలువునా మోసం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 99 శాతం హామీలను నిలబెట్టుకున్నారని వివరించారు. ప్రజలందరూ రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని చెబుతున్నారని వివరించారు. నగరంలో తమ ప్రభుత్వం ఆధ్వర్యంలో విస్తృతమైన అభివృద్ధి జరిగిందన్నారు. విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. వేలాది కోట్ల రూపాయాలు ఖర్చు చేసి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, కార్పొరేటర్లు యలకల చలపతిరావు, చైతన్యరెడ్డి, నాయకులు విశ్వనాధ రవి, మజ్జి శ్రీనివాసరావు, దేరంగుల రమణ, జిలానీ, కిషోర్, గ్రంధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న స్ఫూర్తితో....



ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమం): వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా షేక్ ఆసిఫ్‌ను శనివారం ప్రకటించారు. వృత్తి రీత్యా బిల్డర్‌గా ఉన్న ఆయన 2012 నుంచి రాజకీయాల్లో అడుగుపెట్టారు. జగనన్న స్ఫూర్తితో వైఎస్సార్ సీపీలో చేరారు. తొలిసారిగా 2014 లో విజయవాడ 40వ డివిజన్ కార్పొరేటర్‌గా పోటీచేసి గెలుపొందారు. ఆసిఫ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 2015లో వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేశారు. 2017 నుంచి పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 2018లో పార్టీ మైనార్టీ సంక్షేమ అధ్యయన కమిటీ సభ్యుడిగా పార్టీ ఆయనను నియమించింది. అలానే 2021 నుంచి ఏపీస్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు : ఆసిఫ్ తన తండ్రి షేక్ సుభానీ పేరుతో చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి గత కొన్నేళ్లుగా నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసేవారు. అలానే చిరు వ్యాపారులకు తోడుపు బండ్లు అందజేశారు. పేద ముస్లిం యువతుల వివాహాలకు ఆర్థిక సాయం అందించారు. ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటూ అనేక రకాల సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ కేశినేని నాని చిత్రంలో ఎమ్మెల్యే వెలంపల్లి తదితరులు

- ఎంపీ కేశినేని
- టీడీపీ జిల్లా, మండల స్థాయి నాయకులు వైఎస్సార్ సీపీలో చేరిక

విజయవాడస్పోర్ట్స్: బడుగు, బలహీన వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని విజయవాడ ఎంపీ కేశినాని నాని తెలిపారు. తిరువూరు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గాలకు చెందిన పలువురు టీడీపీ జిల్లా, మండల స్థాయి నాయకులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. విజయవాడలోని కేశినేని భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ కేశినేని నాని సమక్షంలో టీడీపీ నాయకులకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ కేశినేని నాని మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ ప్రభంజనం మరో సారి రానుందని చెప్పారు. సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆర్థిక, సామాజిక అభివృద్ధి పట్ల సీఎం జగన్ చూపుతున్న ప్రత్యేక చొరవ ఫలితంగా రాష్ట్రం పేదరిక నిర్మూలన వైపు పయనిస్తుందని చెప్పారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ముగ్ధులై వైఎస్సార్ సీపీలో చేరానన్నారు. వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎంతో ఉన్నతమైన ఆశయాలతో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని, ఇప్పుడు ఎన్టీఆర్ ఐడియాలజీ టీడీపీలో లేదన్నారు. మోసగాళ్లు, దగాకోరులు, భూ కబ్జాదారులతో ప్రస్తుతం టీడీపీ నిండిపోయిందని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందే అభ్యర్థులను జాబితాను సీఎం జగన్ విడుదల చేసి ధైర్యంగా ఎన్నికలకు వెళ్తుంటే.. టీడీపీకి అభ్యర్థులే కరువయ్యారని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో జిల్లాలో వైఎస్సార్ సీపీలో చేరికలు చాలా ఉంటాయన్నారు. జిల్లాలో టీడీపీ ఖాళీ అయ్యే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. ఈ ఎన్నికల అనంతరం టీడీపీకి భవిష్యత్తు ఉండదన్నారు. తనకు పార్లమెంట్ స్థానం కేటాయించిన సీఎం జగన్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కులాలు, మతాలు, ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా సీఎం జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు. సీఎం జగన్ ప్రజా సంక్షేమ, అభివృద్ధి పనులు నచ్చి అనేక మంది పార్టీలో చేరుతున్నారని, మళ్లీ జగనే కావాలని ప్రజలు సంపూర్ణ మనసుతో కోరుకుంటున్నారు. 2019 ఎన్నికల ముందు మోడీని కుటుంబ పరంగా దారుణంగా విమర్శించి బీజేపీతో అప్పటి వరకు కలిసున్న బీజేపీతో ఎందుకు విడిపోయారని చంద్రబాబును ప్రశ్నించారు.

పార్టీలో చేరిన నాయకులు...

తిరువూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు కొత్తగుండ్ల విశ్వేశ్వరరావు(మాజీ సర్పంచ్, గంపలగూడెం), కొత్తగుండ్ల చందు (గంపలగూడెం, మండల నాయకుడు), విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వశీం అక్రమ్ (ఎన్టీఆర్ జిల్లా టీడీపీ కార్యదర్శి), ఫయాజ్‌హుస్సేన్ (తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు), ఇస్మాయిల్ (41వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు), షాబుద్దీన్ (తెలుగు యువత ఉపాధ్యక్షులు), వినన్నపేట మండలానికి చెందిన ఎ.లాలయ్య (మండల టీడీపీ ఫోక్స్ పర్సన్), లక్ష్మయ్య (మాజీ సర్పంచ్, మండల నాయకుడు), కొత్తగుండ్ల కృష్ణ (గంపలగూడెం మండల నాయకుడు).

సరైన కోర్సును ఎంచుకోవడం ఉత్తమమైన మార్గం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

పటమట(విజయవాడ తూర్పు): సరైన కోర్సును ఎంచుకుని జీవితంలో ఉత్తమమైన మార్గంలో పయనించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి సూచించారు. మేరీస్ స్టెల్లా కాలేజీ 62వ వార్షిక వేడుకలు కాలేజీ ఆవరణలో శనివారం నిర్వహించారు. హేమచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కష్టపడి చదవాలని, పోటీ ప్రపంచంలో కెరీర్‌ను ఉన్నతంగా మలచుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ఎన్నో పథకాలు అమలుచేసిందని చెప్పారు. అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎప్టానిక్స్ సీఈవో దాసరి రామకృష్ణ, వేదిక్ ఫౌండేషన్ ఫౌండర్ వేణిమాధవి, కాలేజీ కరస్పాండెంట్ క్వాడ్రస్ పాల్గొన్నారు.



